క్లుప్తంగా

రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలో ఈనెల 11వ తేది తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కేఎంసీ కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అక్కాయపల్లి, చెమ్ముమీయపేట, సాయిపేట, బెల్లంమండి, మాసాపేట, గౌస్ నగర్, శంకరాపురం, ప్రకాష్ నగర్, సరోజినీ నగర్, ఓం శాంతి నగర్ (2, 3, 4, 5, 6, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 15, 27, 28, 32, 33, 34, 35, 36, 37, 38, 39, 40, 41, 42, 43, 44, 46, 47) వార్డులకు తాగునీటి సరఫరా చేస్తున్న బండికనుమ వాటర్ వర్క్స్‌లో గల భూగర్భ జలాశయాలను శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ మేరకు శనివారం తాగునీటి సరఫరాలో తాత్కాలిక అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

కడప ఎడ్యుకేషన్: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యకర వాతావరణంలో విద్యాభ్యాసం సాధ్యమవుతుందని జాతీయ సేవ పథకం యూనిట్-9 పీవో డా. కె. శ్రీనివాసరావు అన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా, విశ్వవిద్యాలయ న్యూ ఆర్ట్స్ బ్లాక్ పరిధిలో గురువారం నిర్వహించిన శుభ్రత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డా కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశుభ్రతకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విశ్వవిద్యాలయాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుడు సి. నారాయణ రెడ్డి , పలువురు వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక ఫీజు వసూళ్లను ఆపాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల రెవెల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ కార్యాలయ సూపరింటెండెంట్ సీతారామకృష్ణను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాజీపేట మండల పరిధిలోని బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్ర, కార్తీక్, సదాశివ, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజేష్

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వ వసతి గృహాల్లో పనిచేస్తున్న హాస్టల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించి కనీస వేతనాలు రూ.24 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ , జిల్లా అధ్యక్షులు జి వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసి బాదుల్లా డిమాండ్ చేశారు. గురువారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా సమస్యలు ఎదుర్కొంటున్నారని, కానీ ఇప్పటి వరకు సరైన పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెప్మా, స్పెర్స్ ఉద్యోగుల మాదిరిగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా హెచ్ఆర్ పాలసీ అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు పి సుబ్బరాయుడు, నాయకులు సునీల్, సంక్షేమ హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రసాదు చంద్రశేఖర్, మునికుమార్, భారతి, విజయకుమారి, శాంతమ్మ, పెంచలమ్మ పాల్గొన్నారు.

డ్రైవర్ల పై దాడి చేయడం తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కత్తి మీద సాము లాంటి డ్రైవర్ వృత్తిలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణికులను సురక్షితంగా వారి వారి గమ్యాలకు చేరవేస్తున్న డ్రైవర్లపై, కండక్టర్లపై దాడి చేయటం తగదని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మడగలం ప్రసాద్ అన్నారు. గురువారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉచిత ప్రయాణాన్ని ప్రవేశపెట్టిన నాటినుండి, ప్రయాణికులు అధికమై డ్రైవర్లు, కండక్టర్లపై దాడులు చేయడం అధికమయ్యాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కొత్త బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు.

దాతల సహకారం.. బడికి వసతుల మార్గం



రంగులతో కళకళలాడుతున్న పాఠశాల నేమ్ బోర్డు



సమకూరిన అదనపు తరగతి గది



పాఠశాల ఆవరణలో సమకూరిన చప్పట

– అదనపు తరగతి గదితోపాటు చప్పట, రంగుల కళకళలు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు, దాతల సహకారంతో కడప నగరం బాలాజీనగర్ సమీపంలోని తారక రామానగర్‌లోని మోడల్ ప్రైమరీ ప్రాథమిక పాఠశాల కొత్తరూపు సంతరించుకుంది. తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయుల సహకారంతో రూ. 1,70,000 ఖర్చు చేసి పాఠశాలను అభివృద్ధి చేశారు. ఇందులో భాగంగా పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణం, కాంపౌండ్‌లో ఫ్లోరింగ్, ఆర్చిపై పాఠశాల పేరు రాయించడంతోపాటు పెయింటింగ్ మొదలకు పనులు చేయించారు.

– ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 77 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో హెచ్‌ఎంతోపాటు ఐదు మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరందరికి అదనపు తరగతి సమకూరడంతో విద్యాబోధనకు సౌకర్యంగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు.

అభివృద్ధికి సహకరించిన దాతల వివరాలు...

అదే పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పనిచేసి గత నెల 30వ తేదీ పదవీ విరమణ చేసిన నరేంద్రరాజు పాఠశాల అభివృద్ధి కోసం రూ. 50 వేలు విరాళంగా ఇచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు. అలాగే పదవీవిరమణ చేసిన ప్రధానోపాధ్యాయురాలు గిరిజకుమారి రూ.33 వేలు, యస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ నరసింహబాబు రూ. 30 వేలు, టీచర్ రామలక్ష్మి రూ. 10 వేలు, టీచర్ నరసింహరావు రూ. 10 వేలు, టీచర్ సరోజమ్మ రూ. 7500, టీచర్ వనజాక్షి రూ. 5 వేలు, ప్రతిభా భారతి పేరెంట్ రూ. 4 వేలు, సుబ్బరాజు పేరెంట్ రూ, 2 వేలు ఇచ్చి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

పాఠశాల రుణం తీర్చుకునేందుకు...



తాము పనిచేసిన పాఠశాల రుణం కొంతైనా తీర్చుకోవాలనే ఉద్దేశ్యంతో పాఠశాల అభివృద్ధికి రూ. 50 వేలు విరాళంగా ఇచ్చాను. నాతోపాటు మా పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు కూడా విరాళాలు ఇచ్చారు. నేను గత నెల 30వ తేదీ పదవీ విరమణ చేశాను. – నరేంద్రబాబు, పదవీ విరమణ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం

రిమ్స్‌లో వైట్ కోట్స్ కార్యక్రమం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న రిమ్స్ అధికారులు

కడప అర్బన్: కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో మేజర్ ఈవెంట్‌గా మెడికల్ విద్యార్థుల కోసం ×వైట్ కోట్స్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వైద్య వృత్తి పట్ల తాము కలిగిన నిబద్ధతను వెల్లడిస్తూ, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఈ విద్యను ఎంచుకున్నట్టు తెలిపారు. భవిష్యత్తులో సమాజానికి మేలు చేయాలన్న లక్ష్యంతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జమున, సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఆచార్యులు, కళాశాల సిబ్బంది కూడా పాల్గొన్నారు.

ప్రపంచ విప్లవకారుడు చేగువేరా

కడప ఎడ్యుకేషన్: ప్రపంచ విప్లవకారుడు చేగువేరాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం కడప నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేగువేరా వర్ధంతి నిర్వహించారు. అనంతరం ఎం.అంకన్న మాట్లాడుతూ చేగువేరా విద్యార్థి దశ నుంచి విప్లవభావాలకు ఆకర్షితుడై ప్రపంచ విప్లవకారులలో అత్యంత ప్రముఖుడుగా నిలిచాడని తెలిపారు. ఆయనను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు.

ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు వసుంధర, భార్గవి, హర్షిని, అర్చన, రాణి, సాయి శ్రీనివాస్, ఖాదర్ వలి, తరుణ్, శ్రీనివాస్ రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

మాసీమ బాబుకు ఘన సన్మానం



మాసీమ బాబును సన్మానిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన మాసీమ బాబును ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సన్మానించారు. గురువారం జిల్లా విస్తృత స్థాయి సమావేశం అనంతరం ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ మేడా రఘునాథరెడ్డి, మాజీ మేయర్ సురేష్ బాబు పాల్గొన్నారు.

పన్ను చెల్లించి సర్టిఫికెట్ సమర్పించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : దీపావళి పండుగ నేపథ్యంలో టపాసుల దుకాణాలను తహసీల్దార్లు సూచించిన ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు లైసెన్స్ జారీకి వాణిజ్య పన్నులశాఖ వారికి తగిన పన్ను చెల్లించాలని ఆర్డీఓ తెలిపారు. అనంతరం వారు జారీ చేసిన సర్టిఫికెట్‌ను తమ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. కొత్త లైసెన్స్‌తోపాటు గత సంవత్సరంలో లైసెన్స్‌లు పొందిన వారు రెన్యూవల్ కోసం దరఖాస్తులు సమర్పించాలన్నారు.

రిమ్స్ కార్మికులను తొలగించరాదు



రిమ్స్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌సీపీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రిమ్స్ కార్మికులను తొలగించవద్దని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి కోరారు. గురువారం ఈ మేరకు రిమ్స్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు ఆర్‌సీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాన్ని నమ్ముకుని జీత బత్యాలపై ఆధారపడి పని చేస్తున్న కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించటం అంటే వారిని, వారి కుటుంబాన్ని రోడ్డుపాలు చేయడమేనన్నారు. ఆస్పత్రిలో వైద్యుల కొరత అధికంగా ఉందని, వైద్య పరికరాలను సమృద్ధిగా ఉండేలా చూడాలని, జిల్లా నలుమూలల నుండి వివిధ జబ్బులతో వచ్చిన రోగులు ఎవరు కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే మెరుగైన వైద్యాన్ని అందించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీయు రాష్ట్ర కార్యదర్శి సిద్ధరామయ్య, ఆర్‌సీపీ నాయకులు విజయ్ కుమార్, రమేష్ బాబు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యం



డాక్టర్ హరిత

కడప రూరల్: మనిషి సంపూర్ణ ఆరోగ్యంలో మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమైనదని అమృత మైండ్ కేర్ ఆసుపత్రి వైద్యురాలు హరిత తెలిపారు. ఆసుపత్రిని ప్రారంభించి ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం స్థానిక ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆధునిక సమాజంలో మనిషిని ఒత్తిడి, ఇబ్బందులు పట్టిపీడిస్తున్నాయని తెలిపారు. ప్రతి 8 మందిలో ఒకరు మానసిక సమస్యతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యం అంటే కేవలం శారీరక ఆరోగ్యమే కాదని మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమైనది అన్నారు. మానసిక సమస్యలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సమస్యలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో కలవని తెలిపారు.

పోరాటంలో భాగస్వాములు కావాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఓటరు జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ చేపట్టిన దేశ వ్యాప్త ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరాన్ని ప్రజలు గుర్తించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని 36వ డివిజన్‌లో ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై ఓట్ చోర్ -గద్దెచోడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ నాయకులు దాసరి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేవీవీ నాయకులు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు బాల్యదశ నుంచి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మ్యాజిక్ కార్యదర్శి బాలబయ్యన్న, ప్రతినిధి వెంకటేశులు అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ 4,7 ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలంలోని ఇసుకపల్లె ,మిట్టమీద పల్లెలో ప్రత్యేక శిబిరాలు రెండవ రోజు కొనసాగాయి. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె. లలిత , డాక్టర్ సునీత ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిబిరంలో కేన్సర్ వ్యాధి గురించి గ్రామీణులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మ్యాజిక్ కార్యదర్శి బాలబయ్యన్న, ప్రతినిధి వెంకటేశు ప్రదర్శించిన ఇంద్రజాలం ఆకట్టుంది. మూఢనమ్మకాల వల్ల జరిగే నష్టాన్ని వివరించారు. వారం రోజులపాటు గ్రామంలో చైతన్య , సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రోగ్రాం ఆఫీసర్లు తెలిపారు. వాలంటీర్లు పాల్గొన్నారు.

మెడికల్, లైఫ్ ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ రద్దు



జీఎస్టీ పై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: మెడికల్, లైఫ్ ఇన్సూరెన్స్ విభాగాలపై జీఎస్టీ రద్దు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక వేదాంత ఆసుపత్రిలో జీఎస్టీపై ఆసుపత్రి సిబ్బంది, రోగుల సహాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలలో కొనుగోలు శక్తి పెంచడానికి, ఉత్పాదకరంగాలలో అభివృద్ధిని సాధించడానికి జీఎస్టీని తగ్గించిందన్నారు. ఆ మేరకు మెడికల్, లైఫ్ ఇన్సూరెన్స్ విభాగాలకు జీఎస్టీ రద్దు అయిందన్నారు. ప్రజలు మెడికల్ ఇన్సూరెన్స్ ను తీసుకోవడం వలన, ఖరీదైన వైద్యం ను సులభతరంగా పొందవచ్చు అన్నారు. ఈ విషయాలపై ప్రజలు అవగాహన కలిగి, జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ శ్రావణ్ కుమార్, డాక్టర్ ఎన్ దినేష్ కుమార్ రెడ్డి, డాక్టర్ పి శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయి పై దాడి చేసిన మతోన్మాది అయిన న్యాయవాది రాకేష్ కిషోర్ ని కఠినంగా శిక్షంచాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎస్.డి. విజయ జ్యోతి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు జడ్జి పైన సుప్రీంకోర్టు న్యాయవాది రాకేష్ కిషోర్ బూటు విసిరి దాడి చేయడం దేశానికే సిగ్గుచేటు అని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పీర్, జిల్లా ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, కమలాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ అశోక్ కుమార్ రెడ్డి , మైనార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మైనుద్దీన్, బద్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లో లెవెల్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప కార్పొరేషన్ పరిధిలో ఉన్న మామిళ్ళపల్లి, ఎర్రముక్కపల్లి అంగడి వీధి రైల్వే లైన్ కింద జరుగు తున్న సబ్ వే లో లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డీసీసీ ఉపాధ్యక్షులు ప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఎర్రముక్కపల్లె వద్ద జరుగుతున్న రైల్వే లో లెవెల్ బ్రిడ్జి పనులను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు ఒకటిన్నర సంవత్సరం క్రితం చేపట్టిన సబ్ వే లో లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. ఈ నిర్మాణ పనులపై అధికారులు , శాసనసభ్యులు వెంటనే స్పందించి ప్రజల కష్టాలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు నజీర్ అహ్మద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మల్లెం విజయభాస్కర్, ఆరిపుల్లా, సుబ్బారెడ్డి, గౌస్ మొహిదీన్, గంగా ధర్, సాంబశివుడు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రేపు సమావేశం

కడప ఎడ్యుకేషన్: కడప బాలోత్సవ సభ్యులకు నెలవారి సమావేశం ఈ నెల 11వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని వైఎస్సార్ కడపజిల్లా బాలోత్సవ కమిటీ తెలిపింది. ఈ సమావేశాన్ని కడప యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నామని వారు తెలిపారు. ఈ సమావేశంలో కడప బాలోత్సవం 3వ పిల్లల పండుగపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఇంటిలో సామగ్రి ధ్వంసం

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో శాస్త్రినగర్‌లో నివాసం వుంటున్న అజీజ్ అనే రౌడీషీటర్ గురువారం పర్వీన్ అనే మహిళను బెదిరించి డబ్బులు ఇవ్వాలని, ఇంటిలోకి వెళ్లి సామాగ్రి సైతం ధ్వంసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కడప తాలూకా ఏఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నాగముని

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజినల్ ప్రెసిడెంట్ ఎస్.నాగముని తెలిపారు. గురువారం కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలో కార్మికుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర కార్యాలయం ఇచ్చిన ఆదేశాలను 1/2019 సర్క్యులర్‌ను ఖచ్చితంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కాల పరిమితి ముగిసిన టిమ్స్ స్థానంలో నూతన టిమ్స్ ఏర్పాటు చేయాలని, ఛార్జింగ్ సమస్యలు లేకుండా బస్సుల్లో కంట్రోల్ పాయింట్లలో ఛార్జింగ్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కడప రీజియన్‌లోని లీవుల పెట్టెలను తొలగించి పాత పద్ధతిలో మంజూరు చేయాలన్నారు. తనిఖీ అధికారులు ఉద్యోగులపై కేసులు రాసేటపుడు సంస్థ నియమ నిబంధనలు పాటించకుండా కేసులు నమోదు చేస్తున్నారన్నారు. మహిళలకు ప్రతి నెల మూడు రోజులు సెలవులు, చైల్డ్ కేర్ సెలవులు మంజూరు చేయాలన్నారు. స్త్రీ శక్తి పథకం అమలైన తర్వాత చాలా సర్వీసులకు రన్నింగ్ టైమ్ సరిపోవడం లేదని, సర్వే చేసి రన్నింగ్ టైమ్ పెంచాలన్నారు. పులివెందుల-కడప, పులివెందుల-తిరుపతి, పులివెందుల-రాయచోటి, పులివెందుల-తాడిపత్రి సర్వీసులకు సర్వే నిర్వహించి ఓటీలను పెంచాలన్నారు. ప్రొద్దుటూరు-కడప, వేంపల్లె-పులివెందుల రహదారిలో సర్వే నిర్వహించాలన్నారు. బద్వేలు డిపో ఇన్ గేటు వద్ద బస్సులు తిరిగేందుకు సరైన స్థలం లేదని, షాపులు ఆక్రమించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కారణంగా రోడ్డును వెడల్పు చేయాలన్నారు. సర్క్యులర్ నిబంధనలకు విరుద్ధంగా కౌన్సెలింగ్ పేరు మీదుగా డీపీటీఓ ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటూ ఆబ్సెంట్ వేస్తూ ఉద్యోగులను వేధించడం తగదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాష, నాగరాజు పాల్గొన్నారు.